

ప్రైవేటు ఆస్పత్రులపై దాడులు
చిత్తూరులోని పలు ప్రైవేట్ ఆస్పత్రులపై జిల్లా వైద్యశాఖ అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. - 8లో



ఇసుక అక్రమ రవాణాకు చెక్
కౌండిన్య నదిలో నుంచి ఇసుక అక్రమ రవాణా జరగకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. - 8లో



చోరీ చేసిన కార్లను..
ఏపీకి చెందిన కార్లను చోరీ చేసి తక్కువ ధరకు విక్రయిస్తున్న చెన్నైకు చెందిన దేవకుమార్‌ను పోలీసులు పట్టుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నకిలీ పట్టాల సంగతి తేలుస్తాం



తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

వి.కోట: మండలంలో నకిలీ భూ పట్టాల బాగోతం కథ తేలుస్తామని చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. బుధవారం ఆమె వి.కోట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వి.కోటలో భూముల విలువ పెరగడంతో నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ, శ్మశాన భూములను సైతం కలిపి రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా విక్రయించి ప్లాట్లు వేసి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. అంతేకాక నకిలీ భూపట్టాల వ్యవహారంలో రెవెన్యూ అధికారులే అక్రమాలకు పాల్పడుతూ రైతులను ఇబ్బంది పెడుతున్నట్లు తెలిసిందన్నారు. తహసీల్దార్ పార్వతి, ఆర్ఐ మోహన్ రెడ్డి, డీటీ బాలాజీ, వీఆర్ఓలు, ఉన్నారు.

రెవెన్యూలో కక్ష పూరిత బదిలీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా రెవెన్యూ శాఖలో కక్ష పూరితంగా ఉద్యోగుల బదిలీలు నిర్వహించారని మాజీ రెవెన్యూ ఉద్యోగుల సంఘ రాష్ట్ర నాయకులు మాదిరెడ్డి విజయసింహారెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ బదిలీల్లో 30 మంది డిప్యూటీ తహసీల్దార్లను 100 కి.మీ.కు పైన ఉన్న కుప్పం, శాంతిపురం, రామకుప్పం, సదుం, సోమల, చౌడేపల్లి, నగరి, నింద్ర, విజయపురం మండలాలకు బదిలీ చేశారన్నారు. తహసీల్దార్ బదిలీల్లోనూ అన్యాయం జరిగిందని తెలిపారు.

మీ సహకారం మరువలేనిది



గ్లోరియాను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో జిల్లా పరిషత్ సీఈఓగా బాధ్యతలు తీసుకున్నప్పుడు ఆందోళన చెందానని, అయితే జెడ్పీ చైర్మన్‌తో పాటు ఉద్యోగులు అందరూ సొంతమనిషిలా చూసుకున్నారని మాజీ సీఈఓ గ్లోరియా తెలిపారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ మాజీ సీఈఓ గ్లోరియాకు ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల పీఎఫ్ సమస్యల పరిష్కారంలో గ్లోరియా చొరవ మరువలేనిదన్నారు. ఉద్యోగుల సంఘం నాయకులు చెంచురత్నం మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ ఇంక్రిమెంట్ల సమస్య సీఈఓగా గ్లోరియా వచ్చాక పరిష్కారం అయిందని తెలిపారు. అనంతరం ఆమెకు వేర్వేరుగా బంగారు ఉంగారాలను బహూకరించి, జ్ఞాపికలు అందజేశారు. కొత్త జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, వైస్ చైర్మన్ రమ్య, స్టాండింగ్ కమిటీ చైర్మన్ భారతి పాల్గొన్నారు.

పీడీ నాగశైలజను రిలీవ్ చేయాలని ఆదేశాలు

చిత్తూరు కలెక్టరేట్ : స్త్రీశిశు సంక్షేమ శాఖలో కింది కేడర్‌లో ఉన్న నాగశైలజ జిల్లా అధికారిగా ఎలా కొనసాగుతోంది ? నిబంధనలకు వ్యతిరేకంగా ఐసీడీఎస్ శాఖ జిల్లా పీడీగా కొనసాగుతున్న ఆమెను వెంటనే ఆ పోస్టు నుంచి రిలీవ్ చేయాలని రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ బుధవారం ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఆమె ఏడాది పాటు గుంటూరులోని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో డిప్యుటేషన్ ప్రాతిపదికన పనిచేయాలని, వెంటనే రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. అలాగే వైఎస్సార్ కడప జిల్లాలోని ప్రొద్దుటూరులో సీడీపీఓగా పని చేస్తున్న హైమావతిని కుప్పం ప్రాజెక్ట్ ఏసీడీపీఓగా నియమిస్తూనే చిత్తూరు ఐసీడీఎస్ పీడీగా ఏడాది పాటు డిప్యుటేషన్‌పై పని చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కల్పవృక్ష వాహనంపై గణనాథుడు

● వేడుకగా కాణిపాక ప్రత్యేక బ్రహ్మోత్సవాలు ● తరలివచ్చిన భక్తజనం



పల్లకిలో స్వామివారి మూల్‌విరాట్‌ను తీసుకొస్తున్న భక్తులు



కల్పవృక్ష వాహనంపై నుంచి భక్తులను కటాక్షిస్తున్న వినాయకుడు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తి

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయకుడి ఆలయంలో ప్రత్యేక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం విశేషపూజలు అందుకున్న శ్రీసిద్ధి బుద్ధి సమేత వినాయకస్వామి కల్పవృక్ష వాహనంపై దర్శనమిస్తూ, మాడవీధుల్లో భక్తులను కటాక్షించారు. మేళతాళాలు, పంబ వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపు అట్టహాసంగా సాగింది. ఈ సేవను తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ముందుగా వేకువజామున ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి అలంకార మండపంలో శ్రీసిద్ధి బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ మూర్తికి ప్రత్యేక అభిషేకం చేశారు. పట్టుపీతాంబరాలు, పరిమళ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి కల్పవృక్ష వాహనంపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు ప్రారంభమైంది. భక్తులు కనులారా స్వామివారి సేవను తిలకించారు.

నేడు పూలంగిసేవ..
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారికి గురువారం పూలంగిసేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ గురుప్రసాద్ తెలిపారు. ఉదయం అభిషేకం, రాత్రి పూలంగిసేవ జరుగుతుందన్నారు.

మొదటికే మోసం!

ఏరు దాటాక తెప్ప తగలేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఆశ చూపి పని చేయించుకోవడం.. అవసరం తీరా పక్కన పెట్టేయడం దశాబ్దాలుగా ఆయనకు అలవాటు. అధికారం కోల్పోయిన ప్రతిసారీ నేను మారాను అంటూ ఊదరగొట్టడం.. పీఠం ఎక్కిన తర్వాత పాతబాటలోనే నడవడం ఆయనకు రివాజు. ఇప్పుడు కూడా అదే సిద్ధాంతం అమలు చేస్తున్నారని టీడీపీ నేతలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీలో దారుణంగా మోసం చేశారని ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఎంపీ.. ఎమ్మెల్యే సీటు త్యాగం చేసి పార్టీకి విధేయత ప్రదర్శించిన వారికి కూడా మొండిచేయి చూపారని మండిపడుతున్నారు. మనస్పర్థలు మరచిపోయి చిత్తశుద్ధితో కూటమి అభ్యర్థుల విజయం కోసం పనిచేసిన వారిని సైతం విస్మరించారని విమర్శిస్తున్నారు. ఈ క్రమంలోనే బడుగు బలహీనవర్గాలకు అన్యాయం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- నామినేటెడ్ పదవుల పందేరంలో వివక్ష
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు దక్కని చోటు
- ఎమ్మెల్యే, ఎంపీ సీటు త్యాగం చేసిన వారికి మొండిచేయి
- బాబు తీరుపై కూటమి నేతల అసంతృప్తి



సాక్షి ప్రతినిధి, తిరుపతి : నామినేటెడ్ పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న వారికి సీఎం చంద్రబాబు షాక్ ఇచ్చారు. వంద రోజుల తర్వాత విడుదల చేసిన మొదటి విడత పదవుల పంపకాల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి, సీటు త్యాగం చేసిన వారికి హ్యాండిచ్చారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన జనసేన, బీజేపీ శ్రేణుల్లో ఒక్కరి కూడా కనీసం కమిటీల్లో సభ్యుడిగా కూడా అవకాశం దక్కకపోవడంతో ఆ పార్టీల నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సైతం చోటు దక్కలేదు. మంత్రి వర్గంలో తిరుపతి, చిత్తూరు జిల్లాలోని ఎమ్మెల్యేలకు స్థానం దక్కకపోయినా.. నామినేటెడ్ పదవుల్లోనైనా న్యాయం జరుగుతుందని అందరూ భావించారు. ఇందులోనూ చంద్రబాబు వివక్ష చూపించారని కూటమి నాయకులు లోలోపల రగిలిపోతున్నారు. ముక్కుబడిగా కేటాయించిన పదవుల విషయంలోనూ స్థానిక ఎమ్మెల్యేలు సూచించిన వారికి మాత్రమే ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. తిరుపతి జిల్లా నుంచి రవినాయుడుకి శాప్ చైర్మన్ పదవి కట్టబెట్టారు. ఊకా విజయకుమార్‌కి ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సభ్యుడిగా, చిత్తూరు జిల్లా కుప్పానికి చెందిన మునిరత్నంకి ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా, చిత్తూరు కార్పొరేషన్ మాజీ మేయర్ కఠారి హేమలతకి ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా, నగరికి చెందిన గంజి మాధవయ్యకు ఏపీ పద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా అవకాశం కల్పించి చంద్రబాబు చేతులు దులిపేసుకున్నారు.

కష్టానికి ఫలితం శూన్యం

తిరుపతి జిల్లాలో టీడీపీ కోసం అహర్నిశలు పనిచేసిన వారు ఎంతో మంది ఉన్నారు. అయితే వారెవ్వరినీ కాదని కొట్టాలకు చెందిన రవినాయుడుకు శాప్ చైర్మన్, తిరుపతికి చెందిన ఊకా విజయకుమార్‌ను కార్పొరేషన్ సభ్యుడిగా నియమించారు. వీరిద్దరూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన దాఖలాలు లేవని టీడీపీ నేతలే ఆరోపిస్తున్నారు. కొట్టాలలో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన వారే గెలుపొందారు. ఊకా విజయకుమార్ నాలుగేళ్లుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారని, కార్పొరేషన్ ఎన్నికల సమయంలో కూడా టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేసిన దాఖలాలు లేవని తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజక వర్గాల పరిధిలో ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఆశించిన వారు అనేక మంది ఉన్నారు. టికెట్ దక్కని వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని ఆశ చూపించి ఎన్నికల్లో పనిచేయించుకున్నారు. కూటమి అభ్యర్థుల విజయం కోసం పనిచేసిన వారు అనేక మంది నామినేటెడ్ పదవులపై ఆశపెట్టుకున్నారు. అయితే ఎవరికీ నామినేటెడ్ పోస్టుల జాబితాలో చోటు దక్కకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రవినాయుడు, ఊకా విజయ్‌కుమార్‌కు సైతం స్థానిక ఎమ్మెల్యే సూచనల మేరకు పదవులు కేటాయించినట్లు విశ్వసనీయ సమాచారం. మొత్తంగా మొదటి విడతలోనే సీఎం చంద్రబాబు తన మార్కు మోసం చేశారని జనసేన, బీజేపీ నేతలు మండిపడుతున్నారు.

కఠారిని ఇంట్లో కూర్చోబెట్టేందుకే..!

చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు తీవ్రంగా ప్రయత్నం చేశారు. అదే విధంగా మాజీ మేయర్ కఠారి హేమలత కూడా ఎమ్మెల్యేగా పోటీ చేయాలని, తనకే టికెట్ కేటాయిస్తారని ధీమాగా ఉన్నారు. చివరకు గురజాల జగన్ మోహన్‌నాయుడుకి టీడీపీ అధిష్టానం టికెట్ కేటాయించింది. దీంతో సీకే బాబు, హేమలత అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే టీడీపీ అధినేత ఒత్తిడి చేయడంతోపాటు, పార్టీ అధికారంలోకి వసే ఏదో ఒక కార్పొరేషన్‌కి చైర్మన్ పదవి ఇస్తామని నచ్చజెప్పారు. ఈ క్రమంలో కఠారి హేమలత మాత్రం తనకు చిత్తూరు నగర మేయర్‌గా అవకాశం ఇవ్వాలని కోరారు. అందుకు అధినేత చంద్రబాబు కూడా సరే అని హామీ ఇచ్చినట్లు సమాచారం. దీంతో టీడీపీ అభ్యర్థి గెలుపు కోసం సీకేబాబు, హేమలత తీవ్రంగా కృషి చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చింది మేయర్ పీఠం దక్కుతుందని భావించిన హేమలతకి ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా పదవి కట్టబెట్టి షాక్ ఇచ్చింది అధిష్టానం. ఇకపై ఆమెను ఇంటికే పరిమితం చేసే కుట్రలో భాగంగానే ఈ పదవి ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. ఇకపోతే మాజీ ఎమ్మెల్యే సీకే బాబుకి ఉన్నత పదవి వస్తుందని ఆయన వర్గీయులు ఆశగా ఎదురు చూశారు. మొదటి విడత పదవుల పంపకాల్లో సీకే బాబుకి మొండి చేయి చూపించారు. అదే విధంగా మరో మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, కాజూరు బాలాజీ, వసంతకుమార్ నాయుడు, చంద్రప్రకాష్ నాయుడు, సీఆర్ రాజన్ తదితరులకు తొలి జాబితాలో చోటు దక్కలేదు. కుప్పం నుంచి మునిరత్నానికి మాత్రం పదవి ఇచ్చి, పనిచేసిన ఎంతో మంది కుప్పం నేతలను విస్మరించారు. పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు నియోజక వర్గాల పరిధిలోని ఏ ఒక్క నాయకుడూ నామినేటెడ్ పదవుల పంపకాల జాబితాలో లేరు. నగరి నియోజక వర్గంలో వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీ గెలుపు కోసం పనిచేసిన రెడ్డివారి చక్రపాణిరెడ్డి, లక్ష్మీపతి రాజు, కేజే కుమార్, ఏలుమలై (అమ్ములు), మురళీధర్‌రెడ్డికి చివరకు నిరాశే మిగిలింది.

నిఘా పెంచండి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: విద్యాసంస్థలు, హోటళ్ల వద్ద నిఘా పెంచాలని, రోడ్లపై పోలీసులు ఎక్కువ సేపు కనిపించేలా చూడాలని ఎస్పీ మణికంఠ అన్నారు. బుధవారం ఆయన చిత్తూరు నగరంలోని తాలూక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సర్కిల్ కార్యాలయ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, పెండింగ్ కేసులపై అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను ఎందుకు ఇంకా క్లియర్ చేయలేదని అధికారులను అడిగారు. దర్యాప్తును పూర్తి చేసి, త్వరగా కోర్టుకు చార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. అనుమానితులు, రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. సివిల్, భూతగాదాల్లో అనుమానితులను బైండోవర్ చేయాలని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రమేష్‌బాబును ఆదేశించారు. అనంతరం స్టేషన్‌లో సిబ్బంది బాగోగులు అడిగి తెలుసుకున్నారు.

జెడ్పీ సీఈఓకు వినతి



సీఈఓ రవికుమార్‌నాయుడుకు వినతిస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్ తెలిపారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలో సీఈఓ రవికుమార్ నాయుడును కలిసి సమస్యను విన్నవించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పల్లెల్లో ప్రజల ఆరోగ్య రక్షణకు కృషి చేస్తున్నారని తెలిపారు. కొంతమంది రాజకీయ నాయకులు, అధికారుల అనాలోచిత చర్యల వల్ల కార్మికుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. కొత్తగా వచ్చిన మీరు చొరవ తీసుకుని కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు రమాదేవి ఉన్నారు.

డీఆర్‌డీఏ పీడీ తులసికి వీడ్కోలు



పీడీ తులసిని సత్కరిస్తున్న సమాఖ్య సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ తులసి సేవలు మరువలేనివని జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుకన్య అన్నారు. బుధవారం ఆ శాఖ కార్యాలయంలో డీఆర్‌డీఏ పీడీ తులసికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం పీడీ తులసి మాట్లాడుతూ డీఆర్‌డీఏ అమలు చేసిన అనేక సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా నిలిచి చిత్తూరు జిల్లాకు మంచి పేరు తెచ్చామన్నారు. అనంతరం ఆమెను పలువురు ఉద్యోగులు దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎంలు రవికుమార్, సుబ్బారెడ్డి, ఏపీఎంలు నాగేశ్వరరావు, మధుసూదన్, జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,616 మంది స్వామిని దర్శించుకున్నారు. 22,759 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.3.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతుండగా, లేనివారికి 6 గంటలు పడుతోంది.

ఉపాధిహామీ పనుల్లో అలసత్వం వద్దు

● పనులు పూర్తయిన వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలి
● కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడి



ఇసుక స్టాక్ పాయింట్‌లో జిల్లా కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నిర్వహిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో అలసత్వం ప్రదర్శించకూడదని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం 2024–25 సంవత్సరానికి రూ.5699.13 లక్షలతో 1142 సీసీ రోడ్ల పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిని అక్టోబర్ 10వ తేదీలోపు ప్రారంభించాలన్నారు. లేదంటే సంబంధిత ఏజెన్సీలను రద్దు చేసి మిగిలిన మండలాలకు పనులు కేటాయిస్తామన్నారు. పనులు పూర్తి చేసిన వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు పూర్తయిన వెంటనే డ్రైనేజీ పనులు చేపట్టాలన్నారు. ప్రస్తుతం ఎంపీ ల్యాడ్స్‌లో రూ.2 కోట్లు మంజూరు చేశామని, ఆ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, ఎస్ఈ శంకరనారాయణ, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ, ఈఈలు పాల్గొన్నారు.

కార్యాలయాలను శుభ్రంగా పెట్టుకోండి
జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రంగా పెట్టుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రతి కార్యాలయంలో ఫైళ్లను సంవత్సరాల వారీగా జాగ్రత్తగా ర్యాక్స్, బీరువాలలో భద్రపరచాలన్నారు. అక్టోబర్ 5న ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఏ శాఖలో అయినా అపరిశుభ్రంగా ఉన్నట్లు కనిపిస్తే చర్యలు ఉంటాయన్నారు.

ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలి
చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రభుత్వ ఇసుక పోర్టల్ ద్వారా ఉచితంగా ఇసుక పొందేలా పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. చిత్తూరు మండలం దిగువ మాసాపల్లిలలోని ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆయన జేసీ విద్యాధరితో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక ను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న ఒకటి రెండు రోజుల్లో ఇంటి వద్దకే ఇసుకను సరఫరా చేస్తారన్నారు. కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, మైన్స్ డీడీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఐదు లారీలు సీజ్



అక్రమంగా గ్రానైట్ రాళ్లు తరలిస్తున్న లారీలను అదుపులోకి తీసుకుంటున్న సీఐ హనుమంతప్ప

కార్వేటినగరం: అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న ఐదు లారీలను సీజ్ చేసినట్లు సీఐ హనుమంతప్ప తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అక్రమంగా గ్రానైట్ రాళ్లు తరలిస్తున్నట్లు తమకు రహస్య సమాచారం అందడంతో ఆ మేరకు ఎస్‌ఐ రాజ్‌కుమార్‌తో కలసి సురేంద్రనగరం వద్ద వాహనాలు తనిఖీ చేపట్టామన్నారు. అందులో ఎలాంటి రికార్డులు లేకుండా ఓవర్ లోడుతో పళ్లిపట్టు మీదుగా చిత్తూరుకు తరలిస్తున్న లారీలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం లారీలను సీజ్ చేశామన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని జిల్లా మైనింగ్ అధికారులకు లిఖిత పూర్వకంగా అందించి వాహనాలను వారికి అప్పగించడం జరిగిందని తెలిపారు.

వరకట్నం కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు



నిందితుడు సూరిబాబు

పుత్తూరు: వరకట్నం వేధింపుల కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ పుత్తూరు అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి వి.గోపాలకృష్ణ బుధవారం తీర్పు చెప్పారు. పుత్తూరు మండలం నెత్తం గ్రామానికి చెందిన ఎ.దివ్యభారతి(34) తన భర్త సూరిబాబు(42) వరకట్నం తీసుకురావాలంటూ వేధింపులకు గురిచేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు 345/2020గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో జడ్జి శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు సీఐ సురేంద్ర నాయుడు తెలిపారు. బాధితురాలి తరపున ఏపీపీ నయుంమునిష బేగం కేసు వాదించినట్లు తెలిపారు.

రెవెన్యూశాఖలో బదిలీలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో రెవెన్యూ శాఖలో బదిలీలు చేస్తూ కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు జిల్లావ్యాప్తంగా 9 మంది జూనియర్ అసిస్టెంట్లను, ఒక టైపిస్టును బదిలీ చేశారు. ఎంఆర్‌ఐ కేడర్‌లో చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాకు ఒకరిని, అక్కడి నుంచి చిత్తూరు జిల్లాకు ఒక ఎంఆర్‌ఐను ట్రాన్స్‌ఫర్ చేశారు. చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాకు ఇద్దరు వీఆర్‌ఓలు గ్రేడ్–1, తిరుపతి జిల్లా నుంచి చిత్తూరు జిల్లాకు గ్రేడ్–1 వీఆర్‌ఓలను ఇద్దరిని బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తిరుపతి జిల్లా నుంచి అన్నమయ్య జిల్లాకు ఒకరు, అన్నమయ్య జిల్లా నుంచి తిరుపతి జిల్లాకు ఒకరు గ్రేడ్–2 వీఆర్‌ఓలను బదిలీ చేశారు.

పక్కా.. ఓటరు లెక్క



ఇంటింటి సర్వే ను పర్యవేక్షిస్తున్న చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య

ఎన్నికల నిర్వహణలో ఓటరు జాబితా కీలకం. ఈ జాబితా పారదర్శకంగా ఉంటేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ఈ క్రమంలో తప్పిదాలను సరిదిద్ది ఎన్నికల సమయానికి పారదర్శకమైన ఓటరు జాబితాను తయారు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేశారు. నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తహసీల్దార్లు, ఆర్డీఓలు, జేసీ, కలెక్టర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సాక్షి కథనం..

- జిల్లాలో కొనసాగుతున్న ఓటరు జాబితా ఇంటింటి పరిశీలన
- అక్టోబర్ 18 నాటికి పూర్తి చేసేలా కసరత్తు
- 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదుకు అవకాశం
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో నూతన ఓటర్ల నమోదు, పాత ఓటరు జాబితాలో తప్పు, ఒప్పుల సవరణకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే నమోదైన వారి పేర్లు, చిరునామా, సవరణలకు శ్రీకారం చుట్టారు. తద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించేందుకు కసరత్తు ప్రారంభించారు. ఓటరు నమోదుకు ప్రీ రివిజన్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సంక్షిప్త ఓటరు జాబితా సవరణలను చేపట్టారు. జిల్లాలోని బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలో ఉన్న వారి పేర్లు, చిరునామా తదితర వివరాలను పకడ్బందీగా సర్వే చేస్తున్నారు.

రికార్డు స్థాయిలో పెరిగిన కొత్త ఓట్లు

సార్వత్రిక ఎన్నికలకు ముందు స్వీప్ ఓటరు అనే పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బీఎల్‌ఓలను రంగంలోకి దింపి అర్హులను ఓటరుగా నమోదు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. యువతీ యువకులు సైతం ముందుకు రావడంతో జిల్లాలో రికార్డు స్థాయిలో కొత్త ఓట్లు నమోదయ్యాయి.

గడువులోపు పూర్తి చేసేలా కసరత్తు

ఓటర్ల పోలింగ్ కేంద్రాల పరిశీలన, రాజకీయ పార్టీలతో చర్చించడం, పోలింగ్ బూత్‌లోనూ ఓటర్ల సంఖ్య 1500లకు మించకుండా ఉండేలా చూడడం, పోలింగ్ కేంద్రం ఓటర్లకు రెండు కిలోమీటర్ల దూరం మించకుండా ఉండేలా చూడడం తదితరాలను అక్టోబర్ 18 నాటికి పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అక్టోబర్ 19 నుంచి 28వ తేదీ వరకు ఫార్మెట్–1 నుంచి 8వ ఫార్మెట్ వరకు రూపుదిద్దేలా కసరత్తు చేస్తున్నారు. దీంతో పాటు ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ రోల్ తయారు చేసి, అక్టోబర్ 29వ తేదీ సమగ్ర ఓటర్ల ముసాయిదా జాబితాను జిల్లా ఎన్నికల అధికారి విడుదల చేస్తారు. ఆ రోజు నుంచి నవంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. డిసెంబర్ 24 నాటికి అభ్యంతరాలు పరిష్కారం, 2025 జనవరి 6న తుది జాబితాను ప్రకటించనున్నారు.

నూతన ఓటర్లపై ప్రత్యేక దృష్టి

కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే యువత ఎవరైనా ఉన్నారా అని ఆరా తీస్తున్నారు. ఇప్పటికే 18 ఏళ్లు నిండి ఓటరుగా నమోదు కాని వారు ఉంటే వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల ప్రస్తుత పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఇందుకోసం బీఎల్‌ఓలు యాప్‌ను రూపొందించి అందులో ఈ అంశాలను నమోదు చేసి ఆన్‌లైన్ చేస్తున్నారు.

జాబితాలో సవరణలు

ఈ ఏడాది మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు వారం రోజులు ముందు ఓటరు తుది జాబితా విడుదల చేశారు. దీంతో సమయాభావం వల్ల కొంతమంది తమ పేర్లు, చిరునామా తదితర వివరాలను సరిచూసుకోలేకపోయారు. మరికొంతమంది పేర్లు జాబితాలో లేకపోవడంతో మళ్లీ నమోదు చేసుకోలేకపోయారు. అలాంటి వారికి ఎన్నికల సంఘం ఏటా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అర్హులను చేర్చి, అనర్హులను తొలగించే ప్రక్రియ చేపడుతోంది. ఈ ఏడాది కూడా బూత్ స్థాయి ఉద్యోగులు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు జాబితాలో ఉన్న వివరాల ప్రకారం పరిశీలన చేస్తున్నారు. ప్రధానంగా ఓటరు జాబితాలో ఉన్న చిరునామాలో సదరు వ్యక్తి నివసిస్తున్నాడా లేదా తన ఓటు మరో ప్రాంతానికి బదిలీ చేయాలా అని ఆరా తీస్తున్నారు. పేర్లు, చిరునామాలో ఎలాంటి సవరణలు చేపట్టాలి, ఫొటోలు మార్చాలా, ఏవైనా మార్పులు ఉన్నాయా అని ప్రశ్నిస్తున్నారు. ఓటర్లు కోరితే మార్పు చేస్తున్నారు.

పకడ్బందీగా ప్రక్రియ



ఎన్నికల సంఘం ఆదేశించిన షెడ్యూల్ ప్రకారం క్షేత్రస్థాయిలో పకడ్బందీగా కసరత్తు చేస్తున్నాం. ఓటర్ల ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని ఆదేశించాం. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నాం. గడువు తేదీలోపు ప్రక్రియను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. అలాగే 18 ఏళ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

– సుమిత్ కుమార్ గాంధీ, కలెక్టర్, చిత్తూరు

జిల్లాలో ఇంటింటి సర్వే సమాచారం



జిల్లాలోని మొత్తం ఓటర్లు	ఇప్పటి వరకు పరిశీలన పూర్తయిన ఓటర్లు	ఇంటింటి సర్వే పరిశీలన శాతం	సర్వేలో గైర్హాజరైన ఓటర్లు
15,64,267	14,96,513	95.67	5,082
చిరునామా మారినట్టు గుర్తించిన ఓటర్లు	**మృతిచెందిన వారు**	**ఫొటోలు సరిగా లేని వారు**	**రిపీటెడ్ ఓటర్లు**
4,042	4,309	4,528	1,122

రోగులకు ఇచ్చే మందులు పొలాల్లో లభ్యం



పొలంలో పడి ఉన్న మందులు

శాంతిపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో రోగులకు ఇవ్వాల్సిన మందులు చెట్లు, పుట్టల్లో దర్శనమిస్తున్నాయి. రాళ్లబూదుగూరు పీహెచ్‌సీ పరిధిలోని కొత్తపేట నుంచి కొండతిమ్మనపల్లి వెళ్లే నడకదారిలో ఓ నీలగిరి తోట వద్ద భారీగా మందులు పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. వారు పీహెచ్‌సీలో డాక్టరుకు సమాచారం ఇవ్వడంతో సిబ్బందిని పంపి ఆరుబయట పొలంలో పడి ఉన్న మందులను వెనక్కి తెప్పించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏవైనా మందులు కాలం చెల్లితే వాటిని తిరుపతికి పంపి నాశనం చేస్తారు. కానీ ఇంకా ఏడాది పాటు కాలం మందులను ఎందుకు పొలాల్లో వేశారన్నదే ప్రశ్న. దీనిపై రాళ్లబూదుగూరు వైద్యాధికారిణి శివకుమారిని వివరణ కోరగా చిన్నారిదొడ్డి సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లకు మెమోలు ఇచ్చామని, వారి వివరణ ఆధారంగా తదుపరి చర్యలకు సిఫార్సు చేస్తామని చెప్పారు.

పాఠశాల ప్రహరీ కూల్చివేత



కూల్చివేసిన గూడూరుపల్లి స్కూల్ ప్రహరీ

పుంగనూరు: మండలంలోని గూడూరుపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రహరీగోడను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. బుధవారం పాఠశాల హెచ్‌ఎం కనుగొని ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. పాఠశాలకు కేటాయించిన స్థలంలో ప్రహరీ నిర్మించారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

30 మంది ఆర్‌ఐల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆర్‌ఐ, సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. అందులో పవన్‌కుమార్ (కలెక్టరేట్ నుంచి జీడీనెల్లూరు), జీవన్‌సాగర్ (కలెక్టరేట్ నుంచి తవణంపల్లి), జోసఫ్ (పాలసముద్రం నుంచి కలెక్టరేట్), శిరీషా (పెద్దపంజాణి నుంచి డీఎస్‌ఓ కార్యాలయం), పుష్పలత (కలెక్టరేట్ నుంచి ఐరాల), సాయిధీరజ్ (డీఎస్‌ఓ కార్యాలయం నుంచి పాలసముద్రం), వేణుగోపాల్ (కుప్పం ఆర్డీఓ కార్యాలయం నుంచి కుప్పం), శ్రీనివాసులు (కుప్పం నుంచి శాంతిపురం), మధుసూదన్ (శాంతిపురం నుంచి బంగారుపాళ్యం), ముబారక్‌బాషా (పూతలపట్టు నుంచి రొంపిచెర్ల), అన్సర్‌బాషా (రొంపిచెర్ల నుంచి పూతలపట్టు), సుధాకర్‌నాయక్(చౌడేపల్లి నుంచి రొంపిచెర్ల), మోహన్‌రెడ్డి (వి.కోట నుంచి రామకుప్పం), రేఖ (తవణంపల్లి నుంచి కలెక్టరేట్), దేవి (జీడీ నెల్లూరు నుంచి కలెక్టరేట్), హిమత్ (ఐరాల నుంచి డీఎస్‌ఓ కార్యాలయం), ఫణికుమార్ (సదుం నుంచి పుంగనూరు), రాకేష్ (పలమనేరు నుంచి పెద్దపంజాణి), భారతి (గంగవరం నుంచి చౌడేపల్లి), హనుమంతు (పూతలపట్టు నుంచి పలమనేరు), రిషీంద్ర గౌడ్ (పలమనేరు ఆర్డీఓ కార్యాలయం నుంచి వెదురుకుప్పం), శివకుమారి (పుంగనూరు నుంచి ఆర్డీఓ కార్యాలయం పలమనేరు), గీతాంజలి (డీఎస్‌ఓ కార్యాలయం నుంచి పెనుమూరు), ప్రభు (పెనుమూరు నుంచి పూతలపట్టు) నరేంద్ర (అన్నమయ్య జిల్లా నుంచి గంగవరం), నాగరాజు (రామసముద్రం నుంచి కడా, కుప్పం), దామోదరాచారి (కడా నుంచి వి.కోట), మహేష్ (అన్నమయ్య జిల్లా నుంచి ఆర్డీఓ కార్యాలయం నగరి), నారాయణ (కుప్పం ఆర్డీఓ కార్యాలయం నుంచి పుంగనూరు), యోగానంద్ (శాంతిపురం నుంచి పలమనేరు ఆర్డీఓ కార్యాలయం) కు బదిలీ చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు చెక్

పలమనేరు: పలమనేరు సమీపంలోని క్యాటిల్‌ఫామ్ వద్ద కౌండిన్య నదిలో యథేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. కౌండిన్య నదిలో ఇసుక తవ్వకాలు జరిగే చోట ట్రాక్టర్లు, జేసీబీ వాహనాలు వెళ్లకుండా బుధవారం జేసీబీతో గుంతలు తీయించారు. ఎవరైనా నదిలో ఇసుకను తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ ఇన్బనాథన్ గట్టిగా హెచ్చరించారు. సోమవారం సాక్షి దినపత్రికలో 'ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు' అనే శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై కలెక్టర్ ఆదేశాలతో స్థానిక అధికారులు కౌండిన్యలో ఇసుక రవాణా జరిగే చోట్ల సంబంధిత వీఆర్వోలను పర్యవేక్షకులుగా పెడుతున్నట్లు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

పుంగనూరు: మండలంలోని అక్కింవారిపల్లికి చెందిన ఓ మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేసిన విజయభాస్కర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మైనర్ బాలికపై అత్యాచారం ఘటనకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

34 మంది ఎంపీడీఓల బదిలీ

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో 34 మంది ఎంపీడీఓలను బదిలీ చేస్తూ జెడ్పీ మాజీ సీఈఓ గ్లోరియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలు.

ఎంపీడీఓ	ప్రస్తుతం పనిచేస్తున్న మండలం	బదిలీ అయిన మండలం
ఇందిరమ్మ	పుత్తూరు	రామచంద్రపురం
అరుణ	నింద్ర	ఎర్రావారిపాళ్యం
ధనలక్ష్మి	పూతలపట్టు	ఐరాల
శివరాజు	యాదమరి	గుడిపాల
తాజ్‌మాస్రూర్	గుడుపల్లె	మదనపల్లె
శ్రీనివాసులు	రామచంద్రాపురం	చిత్తూరు
మహమ్మద్‌రఫీ	వి.కోట	పిచ్చాటూరు
అబ్దుల్‌రహీమ్	పెద్దపంజాణి	కలకడ
చంద్రమౌళి	విజయపురం	కార్వేటినగరం
భానుమూర్తిరావ్	వడమాలపేట	కలికిరి
సురేంద్రనాథ్	తంబలపల్లె	తొట్టంబేడు
సురేష్‌బాబు	తొట్టంబేడు	గంగవరం
సుధాకర్	చౌడేపల్లె	కేవీపల్లె
బాలాజీ	పీటీఎం	పెద్దపంజాణి
అబ్దుల్‌కలాంఆజాద్	తవణంపల్లె	సోమల
అమర్‌నాథ్	ఎర్రావారిపాళ్యం	వెదురుకుప్పం
నాగరాజు	ఐరాల	పూతలపట్టు
మధుసూదనరెడ్డి	గంగవరం	రొంపిచెర్ల
ప్రేమ్‌రాజ్ కుమార్	వెదురుకుప్పం	శాంతిపురం
లీలామాధవి	నగరి	గుడుపల్లె
శివశంకర్	బంగారుపాళ్యం	పీలేరు
లక్ష్మీకాంత్	విజయనగరం	రామకుప్పం

చోరీ చేసిన కార్లను తక్కువ ధరకు విక్రయించి..



నిందితుడు దేవకుమార్

వేలూరు: తమిళనాడులోని వేలూరు జిల్లా గాంధీనగర్‌కు చెందిన దేవకుమార్ గుడియాత్తం రోడ్డులో కారు మెకానిక్ షెడ్ నడుపుతున్నాడు. ఇతను చోరీకి గురైన కార్లను తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఇటీవల పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో డీఎస్పీ పయణి, ఇన్‌స్పెక్టర్ ఆనందన్ విచారణ జరిపి మెకానిక్ దేవకుమార్‌కు చెందిన కారు షెడ్‌లో మొత్తం 54 కార్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. పోలీసులు మాట్లాడుతూ నిందితుడు తమిళనాడుతో పాటు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో చోరీ చేసిన ఏసీ కార్లను కంటైనర్ల ద్వారా తీసుకొచ్చి ఇంజిన్, సీజ్ నంబర్లను మార్చి తక్కువ ధరకు విక్రయం చేస్తున్నట్లు తెలిసిందన్నారు. స్వాధీనం చేసుకున్న కార్ల విలువ సుమారు రూ. 2 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. కార్లలో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, తిరుపతికి చెందినవే అధికంగా ఉన్నాయి. అక్కడ వారితో నిందితుడు సంబంధాలు కొనసాగిస్తున్నట్లు భావిస్తున్నారు.

పలువురు సీఐల బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షీమూషీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు వేకెంట్ రిజర్వు (వీఆర్)లో ఉన్న సీఐ డి.మునస్వామిని పుత్తూరు రూరల్‌కు, అక్కడ ఉన్న ఎం.భాస్కర్‌నాయక్‌ను తిరుపతి వీఆర్‌కు పంపారు. అలాగే తిరుపతి వీఆర్‌లో ఉన్న వి.చిన్నపెద్దయ్యను శ్రీసిటీకి, పి.శ్రీరాములును తిరుపతి డీటీఆర్‌బీకి, తిరుపతి ట్రాఫిక్‌లో ఉన్న కె.శ్రీనివాసులును తిరుపతి ఈస్ట్ స్టేషన్‌కు, అక్కడ ఉన్న డి.మహేశ్వర్‌రెడ్డిని తిరుపతి వీఆర్‌కు పంపించారు. తిరుపతి డీటీసీలో ఉన్న ఎ.శ్రీరాముడును తిరుమల టూటౌన్‌కు, తిరుమల టూటౌన్‌లో ఉన్న ఎ.సత్యనారాయణను తిరుపతి వీఆర్‌కు, చిత్తూరు వీఆర్‌లో ఉన్న పి.సత్యబాబును అనంతపురం పుట్లూరుకు, అక్కడ ఉన్న ఆర్‌జీ సుబ్రహ్మణ్యంను అనంతపురం వీఆర్‌కు, అనంతపురం దిశలో ఉన్న కె.లక్ష్మీనారాయణను గంగాధర నెల్లూరుకు, చిత్తూరు వీఆర్‌లో ఉన్న ఇ.కృష్ణమోహన్‌ను పూతలపట్టుకు, పూతలపట్టులో ఉన్న ఎం.సుదర్శన్ ప్రసాద్‌ను చిత్తూరు వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు

ప్రకృతి వ్యవసాయంపై మధ్యప్రదేశ్ అధికారుల అధ్యయనం



ప్రకృతి వ్యవసాయం గురించి తెలుసుకుంటున్న మధ్యప్రదేశ్ అధికారులు

రొంపిచెర్ల: మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యవసాయాధికారులు, రైతులు బుధవారం రొంపిచెర్ల మండలం మద్దినట్లవారిపల్లెలో మెంటార్ వేణి సాగు చేసిన ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించారు. 28 రకాల పండ్ల మొక్కలు, 25 రకాల అంతర్ పంటల కూరగాయల సాగు గురించి అడిగి తెలుసుకున్నారు. దీనిపై రైతులు వారికి పలు విషయాలను తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయంలో పంటలకు ప్రతి 15 రోజులకు ఒకసారి ఘన, ద్రవ జీవామృతాల కాషాయాలు వినియోగిస్తామని చెప్పారు. తద్వారా అధిక ఆదాయం పొందుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మధ్యప్రదేశ్‌కు చెందిన అధికారులు ఆర్యంసింగ్, వివేక్ మౌర్య, హరేంద్రసింగ్, రామ్‌జీసింగ్ ఠాగూర్, స్థానిక ఎన్‌ఆర్వో కల్పన, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు, ఎన్‌ఎఫ్ గురుప్రసాద్, ఎంటీ రమేష్ పాల్గొన్నారు.

డీఆర్‌డీఏలో భారీగా స్థానచలనం

చిత్తూరు కలెక్టరేట్ : గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా భారీగా ఉద్యోగులకు స్థానచలనం కల్పించారు. ఈ మేరకు పీడీ తులసి ఉత్తర్వులు విడుదల చేశారు. అయితే ఆ శాఖ పరిధిలో నిబంధనల ప్రకారం బదిలీలు నిర్వహించకుండా ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు ప్రాధాన్యత ఇచ్చారని పలువురు సిబ్బంది ఆరోపిస్తున్నారు.

బదిలీలు ఇలా..

జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్(డీపీఎం) కేడర్‌లో 3, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీఎం) కేడర్‌లో ఒకే చోట ఐదేళ్లు పనిచేసిన 17 మందిని, రిక్వెస్ట్, అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్‌లో 59 మొత్తం 76 మందిని బదిలీ చేశారు. కమ్యూనిటీ కో ఆర్డినేటర్ కేడర్‌లో ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన 42 మందిని, రిక్వెస్ట్, అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్‌లో 76 మందిని మొత్తం 118 మందిని సాగనంపారు. మాస్టర్ బుక్ కీపర్ కేడర్‌లో ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన 17 మంది, రిక్వెస్ట్, అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్‌లో 23 మందికి మొత్తం 40 మందికి స్థానచలనం కల్పించారు. ఎంఎస్‌సీసీ కేడర్‌లో ఐదేళ్లు పూర్తయిన 8 మందిని, అడ్మినిస్ట్రేషన్, రిక్వెస్ట్ ప్రాతిపదికన 13 మొత్తం 21 మందిని బదిలీ చేశారు. కొత్త జిల్లాల ప్రకారం చిత్తూరు జిల్లాలో 112 మంది, అన్నమయ్య జిల్లాలో 60 మంది, తిరుపతి జిల్లాలో 86 మొత్తం అన్ని కేడర్లలో 258 మందిని బదిలీ చేస్తూ డీఆర్‌డీఏ పీడీ ఉత్తర్వులు జారీచేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి



పి.కొత్తకోట హైస్కూల్ విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ దేవరాజు

పూతలపట్టు: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పి.కొత్తకోట ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా చదువుకు ప్రథమ స్థానం ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. అనంతరం మండల కేంద్రంలోని పీఆర్‌సీని పరిశీలించారు. వీరి వెంట హెచ్‌ఎం గోపి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎక్సైజ్ శాఖ డీసీగా విజయశేఖర్

చిత్తూరు అర్బన్: ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డెప్యూటీ కమిషనర్ (డీసీ)గా టి.విజయశేఖర్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లా ఎస్‌ఈబీ విభాగంలో డీసీగా పనిచేస్తున్న విజయశేఖర్ ఉమ్మడి చిత్తూరు జిల్లాకు డీసీగా వ్యవహరిస్తారు. అలాగే తిరుపతి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌లో డిస్టిలరీ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ)గా పనిచేస్తున్న శ్రీనివాసచారిని చిత్తూరు ఏసీగా, చిత్తూరు విజిలెన్స్‌లో ఏసీగా ఉన్న పి.రామచంద్రా రావును విజయవాడలోని ప్రధాన కార్యాలయానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. అనంతపురం విజిలెన్స్‌లో ఏసీగా ఉన్న ఎన్.బాలకృష్ణను తిరుపతి డిస్టలరీలకు ఏసీగా నియమించారు. ఇక తిరుపతి ఎస్‌ఈబీలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్)గా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాస్‌ను చిత్తూరు ఈఎస్‌గా, నెల్లూరు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి (డీపీఈఓ)గా ఉన్న కె.నాగమల్లేశ్వరరెడ్డిని తిరుపతి ఈఎస్‌గా, తిరుపతి డీపీఈఓగా ఉన్న కె.జానకిరామ్, చిత్తూరు ఎస్‌ఈబీ ఈఎస్ వి.శ్రీధర్‌రావు, చిత్తూరు డీపీఈఓ ఆయేషాబేగంను డిపో మేనేజర్లుగా నియమిస్తూ విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు వెలువడ్డాయి.

ప్రైవేటు ఆస్పత్రులపై దాడులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులపై బుధవారం జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రభావతిదేవి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆస్పత్రుల రికార్డులను తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సెలబ్రిటీ లుక్స్ సెంటర్‌లో ఓ డెంటల్ డాక్టర్ లేజర్ ట్రీట్మెంట్ చేస్తున్నారని, అందుకు సంబంధించిన సర్టిఫికెట్ చూపించాలని కోరారు. శిరీష, నిరంజన్ తదితరులు ఉన్నారు.

రూ.20 వేల కోట్లు అప్పులా ?



మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : వంద రోజుల పాలనలో పింఛన్ తప్ప కూటమి ప్రభుత్వం ఒక్క మంచి పనీ చేయలేదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఏమీ చేయకపోయినా వంద రోజుల పాలనపై కూటమి నాయకులు హడావుడి చేస్తూ ఇంటింటా కరపత్రాలు అందిస్తున్నారని తెలిపారు. సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు వంద రోజుల్లోనే రూ.20 వేల కోట్లు అప్పులు చేశారన్నారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్ని లక్షల టన్నుల ఇసుకను తెలుగు తమ్ముళ్లు మాయం చేశారన్నారు.